
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

శనివారం 2 నవంబరు 2024



టపాసులు కాలుస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

అన్నదాతకు అల్పపీడన భయం...

- కురిసిన వర్షం
- తడిసిన ధాన్యం



జిల్లెల్లలో వర్షానికి కొట్టుకు పోతున్న ధాన్యం

8

కులాలవారీగా లెక్కతేలితేనే సమన్యాయం

- తప్పుడు సమాచారమిస్తే కేసులు
- సమగ్ర సర్వే ఏమైందో దేవుడికే తెలియదు...
- చిత్తశుద్ధితో చేస్తున్న ఈసర్వేతో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నా
- బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

7



మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్

న్యూస్ బాక్స్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చందుర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం మూడపల్లి, రామన్నపేటలో శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేసిన వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు బాణాల రవీందర్ రెడ్డి, భీమారాజు కనకరాజు, పుల్కం మోహన్, డైరెక్టర్ పుల్కం లచ్చయ్య పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు



మొక్క అందజేస్తున్న నాయకులు

బోయినపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బోయినపల్లి మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కలిశారు. దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పొన్నంను కలిసిన వారిలో మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతి గౌడ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఏను గుల కనకయ్య, మాజీ ఎంపీటీసీ స్థంబ లక్ష్మీరాజం ఉన్నారు.

నేరాల ఛేదనలో సీసీ కెమెరాలు కీలకం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నేరాల ఛేదనలో సీసీ కెమెరాలు కీలకమని ఎస్సై రమాకాంత్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం ప్రారంభించారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు.

కార్తీకం.. ఆధ్యాత్మికం

- నేటి నుంచి కార్తీక దీపతోరణ ఉత్సవాలు
- మస్తాబైన ఆలయాలు
- వేములవాడ దేవస్థానంలో నేటి నుంచి డిసెంబరు 1 వరకు ప్రత్యేక పూజలు



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

కార్తీకమాసంలో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది. దైవ సంబంధికమైన వ్రతాలకు, నోములకు, ఉపవాసాలకు, శుభకార్యాలకు ఎంతో ముఖ్యమైంది. శివ కేశవులకు ఇష్టమైన ఈ మాసంలో దీపారాధన ప్రత్యేకంగా కనిపిస్తుంది. శనివారం నుంచి కార్తీక మాసం ప్రారంభం అవుతుండడంతో జిల్లాలోని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా 13వ తేదీ కార్తీక ద్వాదశి సందర్భంగా ఉదయం 6.30 గంటలకు రుక్మిణి విఠలేశ్వర స్వామి పంచోపనీష ద్వారా అభిషయం, సాయంత్రం 6.35 గంటలకు శ్రీకృష్ణ తులసి కల్యాణం నిర్వహిస్తారు, 14న వైకుంఠచతుర్థశి సందర్భంగా ఉదయం అనంత పద్మనాభస్వామివారికి మహాభిషేకం, సాయంత్రం అనంత పద్మనాభ స్వామి అభిషేకం, వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మహాపూజ, పొన్న చెట్టు సేవ ఊరేగింపు, 15వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా రాత్రి జ్వాల తోరణం, నిశిపూజ తరువాత 10.15 నిమిషాలకు రాజరాజేశ్వర స్వామికి మహాపూజలు నిర్వహించనున్నారు.

కార్తీక మాసానికి పేరు ఇలా ..

ఆయా మాసాలలో చంద్రుడు పూర్ణుడై ఏ నక్షత్రంలో ఉంటాడో ఆ నక్షత్రం పేరే ఆ మాసానికి వస్తుంది. కృత్తికా నక్షత్రంపై చంద్రుడు పూర్ణుడై ఉండడంతో ఈ మాసానికి కార్తీక మాసమని పేరు. ఈ మాసంలో కృత్తిక నక్షత్రానికి దీపారాధనకు సోమవారాలకు ప్రాధాన్యం ఉంది. ఈ మాసం ప్రారంభం నుంచి సూర్యోదయానికి పూర్వ మేలేచి నది స్నానం ఆచరించి పొడి బట్టలతో దీపా రాధన చేస్తారు. మహిళలు వ్రతాలు, నోములను ఆచరిస్తారు. కార్తీక మాసంలో బ్రహ్మణుడికి దీపం దానం చేస్తే ఉత్తమ ఫలితాన్ని ఇస్తుందని తులసీ, మారేడు, ఉసిరి కాయలతో శివాలయాల్లో విష్ణు ఆలయాల్లో దీపాలు వెలిగించిన వారికి శుభాలు కలుగుతాయని భావిస్తారు. తులసీ సన్నిధిలో దేవాలయంలో దీపం వెలిగించే వారికి ఐశ్వర్య సిద్ధి కలగడమే కాకుండా ఈ మాసంలో శివార్చన చేసినవారికి గ్రహ దోషాలు పోతాయని భావిస్తారు. ఉసిరి కాయపై దీపాలు పెట్టి వెలిగించడం శుభాలనిస్తుంది. కార్తీక ఏకాదశి నుంచి కార్తీక పున్నమి వరకు మహిళలు భీష్మపంచక వ్రతం చేస్తారు. ఈ ఐదు రోజులు శివమంత్రం, విష్ణుమంత్రం, ఉపదేశం పొందడం ఎంతో ఫలితాన్ని ఇస్తుందని భావిస్తారు. అంతే కాకుండా పరమేశ్వరునికి పంచామృతాలతో అభిషేకం చేయడం ఆవునేతి దీపం వెలిగించడం, పరశివునికి ఇష్టమైన అభిషేకాలు, లక్షపత్రి పూజలు, కోటి బిల్వార్చన చేస్తే సకల పాపాలు పోతాయని భావిస్తారు. కార్తీక మాసంలోనే అయ్యప్ప భక్తులు మాలధారణ చేస్తారు.

జ్వాలతోరణాల వెలుగులు ..

ఈ మాసంలో జ్వాల తోరణాలు వెలుగులు నింపుతాయి. ప్రతీ దేవాలయాన్ని దీపాలతో అలంకరించడంతో శోభాయమానంగా కనిపిస్తాయి. మహిళలు నదుల్లో దీపాన్ని దానంగా వదులుతారు. ఈ దీపాలు మనిషిలోని అజ్ఞానాన్ని, చీకటిని తొలగించి జ్ఞానాన్ని నింపుతాయని భావిస్తారు.

వత్తుల వెలుగులు

దీపాలు వెలిగించడానికి ఉపయోగించే వత్తుల వల్ల కూడా ఉపయోగాలు తెలుపుతాయి. ఒక ముఖం వత్తితో వెలిగిస్తే ఒకమాదిరి లాభం కలిగితే,

మిగతా 8లో..

అంబరాన్నంటిన సంబరం

- ఘనంగా దీపావళి వేడుకలు
- వ్యాపార సముదాయాల్లో లక్ష్మీపూజలు
- వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- జిల్లా వ్యాప్తంగా విరజిమ్మిన వెలుగులు



టపాసులు కాలుస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సౌభాగ్యాన్నిచ్చే దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా గురువారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాడవాడలా వెలుగులు విరజిమ్మాయి. గురువారం రాత్రి వ్యాపార సముదాయాల్లో, ఇళ్లలో లక్ష్మీపూజలు చేశారు. వేములవాడలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో వేడుకలు జరుపుకున్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా క్యాంపు కార్యాలయం సిబ్బందితోపాటు, మండెపల్లిలోని వృద్ధాశ్రమంలో దీపావళి వేడుకల్లో పాలు పంచుకున్నారు. వృద్ధులకు స్వీట్లు పంపిణీ చేశారు. వారితో టపాసులు కాల్చించారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంతోపాటు ఇతర సిబ్బంది ఉన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి కుటుంబసభ్యులతో వేడుకలు జరుపుకోగా వివిధ పార్టీల నాయకులు, సంబరాలు జరుపుకున్నారు. సిరిసిల్ల మానేరు తీరంలో టపాసుల దుకాణాల్లో కొనుగోళ్లతో సందడి కనిపించింది. మహిళలు ప్రత్యేక కేదారీనాథ్ వ్రతాలు చేసుకున్నారు. సిరిసిల్ల ప్రధాన వ్యాపార కూడళ్లయిన గాంధీ చౌక్, పాతబస్టాండ్, కొత్తబస్టాండ్, మార్కెట్ ఏరియా, వెంకంపేట, గోపాల్‌నగర్, బీవైనగర్ చౌరస్తా, శాంతినగర్, పద్మనగర్ చౌరస్తాతోపాటు వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక శోభ కనిపించింది. వేములవాడ రాజన్న ఆలయం, లక్ష్మీవేంకటేశ్వరస్వామి, హరిహరపుత్ర అయ్యప్ప దేవాలయం, సాయిబాబా, శివాలయం, హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

జోరుగా టపాసుల విక్రయాలు

దీపావళి సందర్భంగా సిరిసిల్ల మార్కెట్ జనంతో కిటకిటలాడింది. మానేరు తీరంలో టపాసుల అమ్మకాలు జోరుగా సాగాయి. రూ.550 నుంచి రూ.700 వరకు కిలో చొప్పున విక్రయించారు.

లక్ష ఎకరాలకు సాగునీరు

- విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ నియోజకవర్గం పరిధిలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్, చీఫ్ ఇంజనీర్ సుధాకర్ రెడ్డి, ఈఈ సంతు ప్రకాష్‌తో కలిసి శుక్రవారం వేములవాడ నియోజకవర్గంలోని మల్కపేట రిజర్వాయర్, లచ్చపేట ప్రాజెక్టు, కథలాపూర్ మండలంలోని కలికోట సూరమ్మ చెరువు, వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లి ప్రాజెక్టును సందర్శించిన అనంతరం వేములవాడ పట్టణంలో ఆయా అధికారులతో కలిసి సంబంధిత ప్రాజెక్టులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 9 ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ఇందులో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును మొదటి ప్రాధాన్య క్రమంలో చేర్చారని, మల్కపేట రిజర్వాయర్ ప్రాధాన్య జాబితాలో ఉందని అన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రూ.1737 కోట్లను మంజూరు చేసి ప్రారంభించారన్నారు. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులు తప్ప కొత్తగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులు ఏమీ లేవన్నారు. 2009కు ముందే ఫాజుల్‌నగర్ ప్రాజెక్ట్, రుద్రంగి నాగారం చెరువు రిజర్వాయర్, చందుర్తి రిజర్వాయర్ పూర్తి చేసుకున్నామని గుర్తు చేశారు. వేములవాడ నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులను వినియోగంలోకి తెస్తున్నామన్నారు. 90 శాతం పూర్తయిన మల్కపేట రిజర్వాయర్‌లో మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయడానికి సుమారు రూ.20 కోట్లు వెచ్చించి రైతులకు 30 వేల ఎకరాలకు నీరు అందిస్తామన్నారు. కలికోట సూరమ్మ చెరువు ద్వారా 43 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. కలికోట సూరమ్మ చెరువు కుడి, ఎడమ కాలువలకు నిర్మాణానికి భూ సేకరణ నిమిత్తం నోటిఫికేషన్ త్వరలో విడుదల చేస్తామని, రైతులు సహకరించాలని కోరారు. గతంలో కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్, మర్రిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేములవాడ నియోజకవర్గం పరిధిలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన వివరాలను ఇటీవల జల సౌధలో జరిగిన సమావేశంలో అధికారులను అడిగి తెలుసుకున్నారని వెల్లడించారు.

ఇంజనీర్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్ మాట్లాడుతూ నీటి లభ్యత ఉండి టెక్నికల్ ఫీజుబిలిటీ, బడ్జెట్ ప్రకారం ప్రాధాన్య క్రమంలోని ప్రాజెక్టులను పూర్తిచేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రాజెక్టులను సందర్శిస్తున్నట్లు తెలిపారు.

ప్రజలను మభ్య పెడుతున్న కాంగ్రెస్

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సంజయ్‌కుమార్



కార్యకర్తలతో మాట్లాడుతున్న బండి సజయ్‌కుమార్

ఇల్లంతకుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆరుగ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ డైవర్షన్ రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతోందని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని వెల్జీపూర్‌లో బీజేపీ మండల కన్వీనర్ దెశెట్టి శ్రీనివాస్ ఇంట్లో కార్యకర్తల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనపై విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లు వేశారని, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. మూసినది ప్రక్షాళనకు వెచ్చించే నిధులతో అన్ని హామీలను అమలు చేయవచ్చన్నారు. ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నారే తప్ప ధాన్యాన్ని సేకరించడంలో విఫలమయ్యారన్నారు. నిరుద్యోగులు ఎన్నో ఆశలతో గ్రూపు -1పరీక్షలకు సిద్ధమైనా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించి జీవో 29ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ కార్యకర్తలు ప్రజల కోసం పనిచేయాలని, వారికి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగిడి మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివెద మహిపాల్‌రెడ్డి, మానకొండూర్ అసెంబ్లీ కన్వీనర్ జగన్‌రెడ్డి, మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్, నాయకులు బత్తిని స్వామి, ముత్తక్క, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మ్యాకల మల్లేశం, పున్ని సంపత్, శ్రావణ్, అనీల్, మామిడి హరీష్, అశోక్, మహేష్ పాల్గొన్నారు.

- **కేంద్ర మంత్రికి విన్నపాలు**

వెల్జీపూర్ గ్రామానికి కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ రాగా పలు గ్రామాల నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. రేపాక మీదుగా ఇల్లంతకుంట వరకు డబుల్‌రోడ్డు, ఒగులాపూర్ మీదుగా వల్లంపట్ల వరకు రోడ్డును బాగుచేయాలని వినతిపత్రాలు అందించారు. ఆదర్శ పాఠశాలకు లైటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. వెల్జీపూర్ గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని విన్నవించారు. అనంతరం జాగృతి దీపావళి ప్రత్యేక సంచికను సంజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఉడుతల వెంకటేశం, కముటం రాములు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు తాటిపెల్లి మహేష్, కాసుపాక కిషన్ తదితరులు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సమగ్ర సర్వే ప్రక్రియ షురూ

- పరిశీలించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వేలో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఇళ్ల జాబితా తయారీ ప్రక్రియ ప్రారంభించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బోయినపల్లి, వేములవాడ, వేములవాడ రూరల్ మండలాల్లో జరుగుతున్న సర్వే తీరును పరిశీలించారు. తంగళ్లపల్లిలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పరిశీలించారు. సమగ్ర సర్వేలో భాగంగా 3వ తేదీ వరకు ఎన్యూమరేటర్లు బ్లాక్‌ల వారీగా ఇళ్ల జాబితాను రూపొందిస్తారు. జాబితా ప్రక్రియ పూర్తి చేసి ఈ నెల 6 నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపడతారు. సర్వే కోసం అవసరమైన శిక్షణను సిబ్బందికి అందించారు. జిల్లాలో 1.96 లక్షల కుటుంబాల సర్వేకు 1500 మంది ఎన్యూమరేటర్లు, 170 మంది సూపర్ వైజర్లను నియమించారు. ప్రతీ ఎన్యూమరేటర్ 150 ఇళ్లకు సంబంధించి సమగ్ర వివరాలను సేకరిస్తారు. దాదాపు 84 అంశాల వరకు వివరాలను సేకరించనున్నారు. ఒక బ్లాక్‌గా భావించి ఎన్యూమరేటర్, పది బ్లాక్‌లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించారు. పకడ్బందీగా పూర్తి చేసే దిశగా కార్యక్రమం మొదలైంది.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం తాడూర్, బద్దనపల్లిలో కొనసాగిన సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాస్ చారి, ఎంపీడీవో లక్ష్మీనారయణ, తహశీల్దార్ జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా శుక్రవారం అధికారులు ఇంటింటా తిరిగి కుటుంబ వివరాలను సేకరించారు. వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు కంచర్ల, రంగంపేట, ఎర్రగడ్డతండా గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న అధికారుల సర్వేను తహసీల్దార్ మారుతి రెడ్డి పరిశీలించారు. సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ ప్రవీణ్ ఉన్నారు.

వేములవాడ రూరల్: సామాజిక, ఆర్థిక, ఉపాధి, కుల(సమగ్ర ఇంటింటి సర్వే) పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మండలంలో శుక్రవారం ప్రాంభమైన సమగ్ర కుటుంబ సర్వే విదానాన్ని ఆయన అచ్చన్నపల్లి గ్రామంలో తనిఖీ చేశారు. బాలరాజుపల్లి, వెంకటాంపల్లిలో సమగ్ర కుటుంబ సర్వేలో తహసీల్దార్ సుజాత , ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోయినపల్లి: సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బోయినపల్లి మండల కేంద్రంలో సమగ్ర కుటుంబ సర్వేను కలెక్టర్ సందీప్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్రతి ఇంటి వివరాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ఆయన వెంట జడ్పీ సీఈవో వినోద్, ఎంపీడీవో జయశీల తదితరులు ఉన్నారు.

కోనరావుపేట: ఇంటింటి సర్వే పకడ్బందీగా గాని నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సర్వేను ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ విజయప్రకాశరావు, ఎంపీడీవో శంకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ఆదనపు కలెక్టర్

దరఖాస్తుల ఆహ్వానం

గణేష్‌నగర్, నవంబరు 1(ఆంధ్ర జ్యోతి): జర్నలిజం, మాస్ కమ్యునికేషన్ సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు దరఖా స్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కలువకుంట రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26వ బ్యాచ్‌లో అడ్మిషనర్ల కోసం నవంబరు 25 వ తేదీలోగా తమ దరఖాస్తులను తెలుగు విభాగంలో కన్వీనర్ డాక్టర్ బూర్ల చంద్ర శేఖర్ అందజేయాలని సూచించారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి గాయాలు

వీణవంక నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్భాపూర్ గ్రామ శివారులో కట్టెల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో దొడ్డె మధుకు తీవ్ర గాయాలయ్యాయి. జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన మధు బైక్‌పై వీణవంక వైపు వెళ్తున్నాడు. ఆ సమయంలో కట్టెల లోడుతో వస్తున్న ట్రాక్టర్ (ఏపీ15టీ 5297) బైక్‌ను ఢీకొట్టింది. కింద పడిన మధుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వృద్ధుడి ఆత్మహత్య

రామగుడు, నవంబరు 1(ఆంధ్ర జ్యోతి): ఓ వైపు వృద్ధాప్యం, మరోవైపు అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధుడు కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని రంగసాయిపల్లి గ్రామానికి చెందిన పెద్దిగారి ఎల్లయ్య(85) మధుమేహంతో పాటు మానసిక సమస్యలతో బాధపడు తున్నాడు. ఈ క్రమంలోనే గురువారం దీపావళి పండుగ వేళ ఎల్లయ్య తన బైక్‌పై ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. రాత్రి అయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. లక్ష్మీపూర్ శివారులోని గ్రావిటీ కెనాల్ బ్రిడ్జి వద్ద ఎల్లయ్య వాహనం, చెప్పులు కనిపించాయి. దీంతో కాలువలో గాలించగా మృతదేహం లభ్యమైంది. అనారోగ్య సమస్యల మూలంగా తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని ఎల్లయ్య కుమారుడు బీరయ్య ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

పెద్దపల్లి జిల్లా మంథని బ్రాహ్మణుల వంటకాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. బూడిద గుమ్మడికాయ బురదా, మోతిచూర లడ్డూ, ఆలుబాత్, చల్ల పులుసు, ఉప్పిడి పిండి, బిల్లావక్క, సొజ్జబూరెలు, పునుకులు, దోసకాయ వడియం, పంచామృతం, దోసకాయ బరడా, దోసకాయ పచ్చడి, పొట్లకాయపచ్చడి, గారెబోండలు, వడలు, పులిహోర, చక్కిలాలు, అరిసెలు, చల్లా పిరువ కాయలు, ముద్దపప్పుకూర, పెసరిపిండి ముద్దలు మంథని వంటకాల్లో ప్రత్యేకమైనవి. ఎంతో రుచిగా ఘుమఘుమలాడే బూడిద గుమ్మడికాయ బరడాకు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు సైతం ఫిదా అయ్యారంటే అతిశయోక్తి కాదు.

మంథని రుచులు అదుర్స్



బూడిద గుమ్మడికాయ బరడా కూర

గుమ్మడికాయ బరడా కూర

ఆలుబాత్ రైస్



మోతిచూర లడ్డు

- బూడిద గుమ్మడికాయ బరడాకు మాజీ ప్రధాని పీవీ సైతం ఫిదా..
- మంథని వంటకాలకు ప్రత్యేక గుర్తింపు

మంథని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సహజంగా బూడిద గుమ్మడికాయను దిష్టి తగలకుండా ఇంటి ముందు గుమ్మాలకు వేలాడదీస్తారు. నూతన గృహ ప్రవేశాలు, వాహన పూజలకు సైతం వినియోగిస్తారు. కానీ ఇదే బూడిద గుమ్మడికాయతో "గుమ్మడికాయ బరడా"గా పిలిచే వంటకాన్ని తయారు చేయడం పెద్దపల్లి జిల్లా మంథని బ్రాహ్మణ కుటుంబాల ప్రత్యేకత. వంటల్లో ఒక్కో ప్రాంతానికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అలాగే మంథని ప్రాంత వంటకాలు సైతం ప్రత్యేక గుర్తింపు ఉంది. బూడిద గుమ్మడికాయ బరడాతో పాటు మోతిచూర లడ్డూ, ఆలుబాత్, చల్ల పులుసు, ఉప్పిడి పిండి, బిల్లా వక్క, సొజ్జబూరెలు, పునుకులు, బోడకాకర, పాలకూర, దోసకా య వడియం, పంచామృతం, దోసకాయ బరడా, దోసకాయ పచ్చడి, చింతపండు పులుసు, ఆవకాయ, పొట్లకాయ పచ్చడి, గారెబోండాలు, వడలు, పులిహోర, చక్కిలాలు, అరిసెలు, చల్లపిరువకాయలు, ముద్దపప్పుకూర, పెసరి పిండి ముద్దలు మంథని వంటకాల్లో ప్రత్యేకమైనవి.

మంథనిలోని బ్రాహ్మణ కుటుం బాలు బూడిద గుమ్మడికాయతో ఘుమఘుమలాడే బరడా వంటకాన్ని తయారు చేసుకొని తినడం సంప్రదాయంగా వస్తోంది. వృత్తి, వ్యాపార రీత్యా దేశవిదేశాల్లో స్థిరపడ్డ మంథని బ్రాహ్మణ కుటుంబాలు బూడిద గుమ్మడికాయ బరడా వంటకాన్ని ఇప్పటికీ ఆరగిస్తున్నారంటే ఆ వంటకానికి ఉన్న ప్రత్యేకత అర్థం చేసుకోవచ్చు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆచార్యులు, వేద పండితులు, పీఠాధిపతులను మంథనికి ఆహ్వానిస్తే.. "బూడిద గుమ్మడికాయ బరడా భోజనం పెడతారా.." అంటూ నవ్వుతూ ప్రశ్నించేవారట.

- ప్రముఖులు సైతం ఫిదా..

మంథని నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి ఎమ్మెల్యేగా, ముఖ్యమంత్రిగా, ప్రధానిగా సేవలందించిన



వంటలు చేస్తున్న మంథనికి చెందిన రాజు



సొజ్జ బూరెలు

స్వర్గీయ పీవీ నర్సింహారావు బూడిద గుమ్మడికాయ బరడాను అత్యంత ఇష్టంగా తినేవారు. పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో మంథనికి చెందిన బ్రాహ్మణులు బరడా వంటకం తయారీ కోసం ఢిల్లీలో ఉండేవారంటే అతిశయోక్తి కాదు. మంథని మాజీ ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ శాసన సభ మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాదరావుకు సైతం బూడిద గుమ్మడికాయ బురదా అంటే చాలా ఇష్టం. అంతేకాదు మంథనిలోని చాలా మంది ఇళ్లలో వారంలో ఏదో ఒక రోజు తప్పనిసరిగా బూడిద గుమ్మడికాయ బురదాను వండుకొని తింటారు. అలాగే వివాహాలు, వడుగు, గృహప్రవేశాలు, నోములు, వ్రతాలతో పాటు అన్నదాన కార్యక్రమాల్లోనూ బూడిద గుమ్మడికాయ బరడా కూర వడ్డించడం విశేషం.

రాష్ట్ర స్థాయి ఉషు పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గంభీరావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) ఎస్‌జీఎఫ్ అండర్-17,-19 రాష్ట్రస్థాయి ఉషు పోటీలకు గంభీరావుపేట కేజీబీవీ క్రీడాకారులు ఎంపికయ్యారు. అండర్-17 40 కేజీల విభాగంలో మౌనిక, 44 కేజీ విభాగంలో దీపిక, 48 కేజీ విభాగంలో సోనీ, 56 కేజీ విభాగంలో చరణ్య ఉమ్మడి జిల్లా స్థాయిలో బంగారు పతకాలు సాధించారు. 48 కేజీల విభాగంలో అస్మిత కాంస్య, 52 కేజీ విభాగంలో వైష్ణవి వెండి పతకాలు సాదించారు. అండర్-19లో 60 కేజీ విభాగంలో ఇందు స్వర్ణం సాధించినట్లు పీఈటీ స్వప్నరెడ్డి తెలిపారు. వీరంతా శనివారం మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఉషు పోటీల్లో పాల్గొననున్నారు.

ఆర్టీసీ రీజినల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా మనోహర్‌రెడ్డి

భగత్‌నగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ అకౌంట్స్ ఆఫీసర్‌గా జి.మనోహర్‌రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేసిన చీకోటి వెంకటేశ్వర్లు పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో మనోహర్‌రెడ్డి నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన మనోహర్‌రెడ్డిని ఆర్టీసీ అధికారులు బి మొగిళి, కిరణ్, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మనోహర్‌రెడ్డి డిప్యూటీ రీజినల్ మేనేజర్ భూపతిరెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ఎంచంద్రయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు.

సూక్ష్మ కళలో నైపుణ్యం

- ప్రపంచ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో విష్ణుకు చోటు
- అవార్డులు, సత్కారాలు
- బాల్యం నుంచే సూక్ష్మ దృష్టి

కథలాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బాల్యం నుంచి ఇంటి వద్ద ఇనుప పరికరాలను తన తండ్రి సానబెడుతూ సాగదీయడాన్ని శ్రద్ధగా గమనించిన ఆ యువకుడు 'సూక్ష్మ' దృష్టి సారించాడు. వ్యవసాయానికి పనికి వచ్చే రకరకాల పరికరాలను కాలుతున్న కొలిమిలో పదేపదే పరీక్షగాచూసి కొత్త ఆలోచనలకు ఊపిరి పోశాడు. తన అద్భుత తయారీ విధానంతో ఏకంగా వండర్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించాడు మండలంలోని తాండ్ర్యాలకు చెందిన బండెడ్ల విష్ణు.

- కొంగొత్త పరికరాల రూపకల్పన

తండ్రి స్వతహాగా కమ్మరి వృత్తిలో ఉండడంతో వస్తువుల తయారీ సులువుగా నేర్చుకున్న విష్ణు తనదైన శైలితో ఏదోరకంగా ప్రత్యేకత చాటుకోవాలని చిన్ననాటి నుంచే ఉత్సాహం కనబరిచాడు. అవకాశం కోసం ఎదురు చూస్తున్న క్రమంలో తండ్రి మరింత ప్రోత్సాహం అందించాడు. చదువు మానేసాక కుల వృత్తిలోనే స్థిర



గోరుపై ఇమిడే గొడ్డలి, కొడవలి పరికరాలు

పడాలని నిర్ణయించుకుని కొలిమిలో ప్రయోగాలకు శ్రీకారం చుట్టాడు. గోరుపై ఇమిడే అతి చిన్న



చిన్న సైజ్‌లో తయారుచేసిన ఎడ్లు, కచ్చురం

కొడవలి, గొడ్డలి, కురిపె, కొంక తయారు చేసి పలువురిని అబ్బురపరిచాడు. అగ్గిపెట్టెలో ఇమిడే వివిధ రకాల పరికరాలను రూపొందించాడు. సెంటిమీటర్ పొడవున్న అమర వీరుల స్తూపం, శివలింగం వంటివి తయారు చేశాడు. విష్ణు ప్రతిభను తెలుసుకున్న రాష్ట్ర కళా విభాగానికి చెందిన బృందం తాండ్ర్యాలకు వచ్చి స్వయంగా పరిశీలించింది. 2016లో తెలంగాణ రాష్ట్ర రికార్డుగా నమోదు చేసుకున్నారు. 2021లో ఇందిరాగాంధీ సద్భావన అవార్డు సొంతం చేసుకున్నాడు.

- నలుగురిలో ప్రత్యేకంగా ఉండాలనే..

తండ్రి వృత్తి రీత్యా కమ్మరి కావడం మూలాన వ్యవసాయానికి వినియోగించే పరికరాలను తయారు చేయడాన్ని దగ్గరి నుంచి చూశాను. ఒకరోజు మా నాన్న కొలిమిలో లేని సమయంలో చిన్న వస్తువులను తయారు చేశాను. అందరూ చూసి నన్ను మెచ్చుకున్నారు. అదే స్ఫూర్తిగా అనేక సూక్ష్మ వస్తువులను తయారు చేశాను.



- విష్ణు, కళాకారుడు

అకాల వర్షంతో వరి పంటకు నష్టం

- నేలవాలిన వరి పంట
- ఆందోళనలో అన్నదాతలు

ఇల్లందకుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంట దెబ్బతిన్నది. మండలంలోని రైతులు సుమారు 7,800 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి మర్రివానిపల్లె, సిరిసేడు, ఇల్లందకుంట తదితర గ్రామాల్లోని వరి పంట నేలకొరిగింది. మర్రివానిపల్లె గ్రామంలో 65ఎకరాల్లో వరిపంట పూర్తిగా దెబ్బతిన్నది. విషయం తెలుసుకున్న వ్యవసాయ విస్తరణాధికారి మమత శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట నష్టం వివరాలను అంచనా వేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. కోతకు వచ్చిన పంట దెబ్బతినడంతో తీవ్ర నష్టం జరిగిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

వెల్గటూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆరు గాలం కష్ట పడి పండించిన వరి చేతికి వచ్చే సమయంలో నేల వాలడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో శుక్రవారం ఉదయం కురిసిన



మర్రివానిపల్లెలో నేలవాలిన వరి పొలాన్ని చూసి బోరున విలపిస్తున్న రైతు

చిరు జల్లులకు గాలి తోడు కావడంతో చాలా చోట్ల వరి నేల వాలింది. అసలే సరియైన వర్షాలు లేక కష్ట పడి పండించిన పంటలను అకాల వర్షం రూపంలో నష్టం కలుగుతుందని రైతన్నలు వాపోతున్నారు.

సారంగాపూర్, నవవబరు, 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వర్షం కురువడంతో కోత కోతకు వచ్చిన వరి పొలాలు నేలకొరిగాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆరగబోసిన ధాన్యం కుప్పల్లోకి వర్షం నీరు చేరడంతో రైతులు ఇబ్బందులుపడుతూ తమ ధాన్యం తడవకుండా కవర్లు కప్పుతూ తంటాలు పడ్డారు. ఇంకా కొన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. వెంటనే ప్రారంభించి కొనుగోళ్లు జరిపేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో..

సిరిసిల్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాల్లో శుక్రవారం కురిసిన అకాల వర్షంతో ధాన్యం తడిసిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్, పెద్దూర్, పెద్దబోనాల, చిన్నబోనాల, ముష్టిపల్లి, చంద్రంపేట, రగుడు గ్రామాల్లోని రెండో బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. పెద్దూర్, చిన్నబోనాల గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని వార్డు కౌన్సిలర్లు బోల్గం నాగరాజుగౌడ్, లింగంపల్లి సత్యనారాయణ, పాతూరి రాజిరెడ్డి, పోచవేని సత్య ఎల్లయ్య, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎరవెల్లి వెంకటరమణారావు, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్ పరిశీలించారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన వరిధాన్యం వర్షానికి కోట్టుకు పోయింది. దీంతో సుమారు 50 క్వింటాళ్ల ఉంటుందని బాధిత రైతులు తెలిపారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండల రంగంపేటలో రైతులు తడిసి కొట్టుకుపోయిన ధాన్యాన్ని నీటినుంచి ఎత్తుకున్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్, సింగిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోనుగోలు కేంద్రాల్లోని ధాన్యం పూర్తిగా తడిసింది.



వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి వద్ద నేల వాలిన వరి పైరు



సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లిలో వర్షానికి తడిసిన ధాన్యం



సిరిసిల్ల చిన్నబోనాలలో అకాల వర్షానికి నెలకొరిగిన వరి పంట

మహిళ అదృశ్యం



స్వప్న(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తి గ్రామానికి చెందిన నేరెళ్ళ స్వప్న(31) అనే అవివాహిత మహిళ అక్టోబరు 29వ తేదీనుంచి అదృశ్యమైందని ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. స్వప్న ఇంటి నుంచి బయటకు వెళ్లి రాపోకవడంతో ఫిర్యాదు చేశారని చెప్పారు. స్వప్నకు కొంత కాలం నుంచి మతి స్థిమితంగా లేదని తెలిపారు. గుర్తించినవారు కొత్తపల్లి పోలీసులకు 8712670765 నంబరుకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

చోరీ కేసులో ఇద్దరి రిమాండ్

- రూ.4.50లక్షల కాపర్ వైర్ స్వాధీనం



ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చూపుతున్న పోలీస్‌లు

జమ్మికుంట రూరల్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖకు సంబంధించిన ఐదు వందల కిలోల కాపర్ వైరు చోరీ కేసులో ఇద్దరి వ్యక్తులను పోలీస్‌లు అరెస్ట్ చేశారు. పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ చోరీ వివరాలను వెల్లడించారు. జమ్మికుంట పట్టణ పరిధిలోని దుర్గాకాలనీలో గల ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ గోదాంలో రైల్వే శాఖకు సంబంధించిన జయంత్ ఇన్‌ఫ్రా కంపెనీకి చెందిన రూ.4.50లక్షల విలువ గల ఐదు వందల కిలోల కాపర్ వైరు నిల్వ చేశారు. ఎల్‌బీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ బండవత్ సందీప్, దేవరకొండ జిల్లాకు చెందిన బాలుతో కలిసి ఈనెల 29న గోదామ్ షెట్టర్ తాళాలు పగులగొట్టి ఐదు వందల కిలోల వైరు ఎత్తుకెళ్లారు. దొంగలించిన వైరును కీసర మండలం నాగారంకు చెందిన పాత సామన్లు కొనుగోలు చేసే హేమ కనుకయ్యకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. గోదామ్ ఇన్‌చార్జి జగదీష్‌దాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి చేసి దర్యాప్తు చేపట్టారు. 48గంటల వ్యవధిలో సందీప్, కనుకయ్యను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న వైరు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరగా ఛేదించిన ఎస్ఐ ఆరోగ్యం, హెడ్ కానిస్టేబుళ్లు మోహన్, సదయ్య, సంపత్, కానిస్టేబుల్ వేణు, సిబ్బందిని సీఐ అభినందించారు.

ఆలయంలో చోరీ

కోరుట్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామ శివారులోని గంగమ్మ దేవాలయంలో చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామ శివారులోని ఆలయంలోకి భక్తులు శుక్రవారం ఉదయం వెళ్లగా ఆలయానికి వేసిన తాళం పగుల గోట్టి ఉండడంతో పాటు ఆలయంలోని వస్తువులు చిందరవందగా పడి ఉండడాన్ని భక్తులు గమనించి గ్రామస్థులకు సమాచారం అందించారు. ఆలయంలో గంగమ్మ తల్లిపై ఉన్న అర తులం బంగారు అభరణాలతో పాటు హుండీలో ఉన్న నగదు దోచుకపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. విషయంపై పోలీసులకు వివరణ అడుగగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న మెట్‌పల్లి డీఎస్పీ

మెట్‌పల్లిటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం వెంపల్లి గ్రామంలో గత నెల 30న భార్య సునీత(26)ను హత్య చేసిన భర్త రమేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్‌కు సంబంధించిన వివ రాలను మెట్‌పల్లి డీఎస్పీ ప్రెస్‌నోట్ ద్వారా వివరాలు రిలీజ్ చేశారు. మల్లాపూర్ మండలం వెంపల్లి గ్రామానికి చెందిన వెలుమల రమేష్‌కు 2015లో అల్లీపూర్ గ్రామానికి చెందిన సునీతతో వివాహం జరిగింది. వీ రికి కొడుకు, కూతురు ఉన్నారు. రమేష్ ఉపాధి నిమిత్తం దుబాయి వెళ్లిన రమేష్ నెల రోజుల క్రితం స్వగ్రామం వచ్చాడు. అప్పటి నుంచి దంపతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. భార్య సునీత వివాహేతర సంబంధం పెట్టుకుందని చేయి చేసుకునేవాడు. అదే అనుమానంతో గత నెల 30న ఉదయం భార్యపై దాడి చేశాడు. అనంతరం గొంతు పిసికి హత్య చేశాడు. సునీత తండ్రి మందుల గంగారాజం ఫిర్యాదు మే రకు కేసు దర్యాప్తు చేస్తుండగా గత నెల 31న నిందితుడు ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీలో ఉన్నట్లు తెలియడంతో అక్కడకు కోరుట్ల సీఐ సురేష్ బాబు, మల్లాపూర్ ఎస్ఐ పబ్బ కిరణ్‌కుమార్ అక్కడకు వెళ్లి నిందితుడిని పట్టుకుని విచారించారు. భార్యను హత్య చేసి నట్లు నేరం ఒప్పు కోవడంతో అతడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును త్వరగా ఛేధించిన కోరుట్ల సీఐ, మల్లాపూర్ ఎస్ఐని డీఎస్పీ అభినందించారు.

జిల్లా కేంద్రంలో అగ్నిప్రమాదం

జగిత్యాల క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలోని కస్తూరి స్ట్రీట్‌లో గురువారం రాత్రి ప్రమాదవాశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అమ్మాజీ డ్రెస్ మెటిరియల్‌తో పాటు మరో షాపులో ఒక్క సారిగా మంటలు చేలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తేవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదం దీపావళి పండుగ సందర్భంగా పేల్చిన టపాసుల నిప్పురవ్వతోనే ప్రమాదం జరిగిందని అమ్మాజీ డ్రెస్ మెటిరియల్ యజమాని ఆరోపించారు. రూ. 30 లక్షలకు పైగా డ్రెస్ మెటిరియల్‌తో పాటు ఫర్నీచర్ తదితర వస్తువుల ఆస్తి నష్టం జరిగిందని వివరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వృద్ధురాలిపై వీధి కుక్క దాడి

జగిత్యాల క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని చిలుకవాడలో గురువారం ఓ వృదురాలిపై వీధి కుక్క దాడి చేసి గాయపరిచింది. రాజవ్వ తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో కుక్క దాడి చేయడంతో చేతికి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మెట్‌పల్లిలో ఆవుల బీభత్సం..

- ఇద్దరికి గాయాలు

మెట్‌పల్లిటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ రోడ్ వాసవి టెంపుల్ ఎదురుగా రోడ్డుపై ఆవులు బీభత్సం సృష్టించాయి. మార్కెట్ రోడ్డులో రెండు ఆవుల కుస్తీకి దిగాయి దింతో అటు వైపు వెళ్తున్న వాహనాలకు ఆవులు తగలడంతో ఓ వాహనంపై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా మరో వ్యక్తి స్వల్ప గాయలయ్యాయి. ఆవులు కుస్తీకి దిగడంతో అక్కడ ఉన్న ప్రజలు భయం దోళనకు గురయ్యారు. రోడ్లపై ఆవులు సంచరించకుండ అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

త్రికోటేశ్వరుడి సన్నిధిలో జూనియర్ జడ్జిలు

నరసరావుపేట కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జూనియర్ సివిల్ న్యాయమూర్తులు శుక్రవారం పల్నాడు జిల్లా కోటప్పకొండపై త్రికోటేశ్వరుడిని దర్శించుకున్నారు. కరీంనగర్ సివిల్ న్యాయమూర్తి రాజేశ్వర్, గోదావరిఖని సివిల్ న్యాయమూర్తి సచిన్‌రెడ్డి, దేవరకొండ జూనియర్ సివిల్ న్యాయమూర్తి కేవీఎస్ హరీ‌ష్‌బాబు, భద్రాచలం సివిల్ న్యాయమూర్తి శివనాయక్, జడ్చర్ల సివిల్ న్యాయమూర్తి ముదాసీర్, నిజామాబాద్ సివిల్ న్యాయమూర్తి శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకున్నారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో గురువారం దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయ తలుపులు ధ్వంసం చేసి లోనికి ప్రవేశించి అమ్మవారి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న ముదిరాజు సంఘం పెద్దల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఎల్లారెడ్డిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ముత్యాల మనోజ్‌రెడ్డి జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-17 విభాగంలో వాలీబాల్ రాష్ట్ర స్థాయిలో పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చాడన్నారు. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

దూరవిద్య డిగ్రీలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

జమ్మికుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 15 వరకు గడువు పొడిగించినట్లు జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలని సూచించారు.

డీఏ బకాయిలను చెల్లించాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లందరికీ డీఏ బకాయిలను ఒకే విడతలో చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రవీంద్రచారిలు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 17 విడతల్లో బకాయిలను చెల్లించడం దారుణమని, వాయిదాల పద్ధతిలోకి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను నెట్టవద్దని కోరారు.



శిక్షణ పొందుతున్న ఉద్యోగార్థులు

ఉద్యోగార్థులకు అండగా..

ఎస్సీ స్టడీ సర్కిల్

జగిత్యాల పట్టణంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ నిరుద్యోగులకు అండగా నిలుస్తోంది. ఉచితంగా మెటీరియల్ అందించడంతో పాటు శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా, లక్ష్యానికి చేరువులో మెరుగైన శిక్షణ అందిస్తూ కొలువులు సాధించడంలో నిరుద్యోగులకు స్టడీ సర్కిల్ బాసటగా నిలుస్తోంది. విద్యార్థుల సౌకర్యార్థం డిజిటల్ లైబ్రరీ, గ్రంథాలయం అందుబాటులో కూడా ఉన్నాయి. ఎంపికైన విద్యార్థులకు శిక్షణ తో పాటు ఉచితంగా స్టడీ మెటీరియల్ లేదా రూ.2500 మెటీరియల్ కొనుగోలుకు అందిస్తున్నారు. శిక్షణ తీసుకున్న వారిలో ఇప్పటి వరకు సుమారు 50 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి స్థిరపడ్డారు.

- ఉచిత శిక్షణతో ఉద్యోగావకాశాలు
- నాలుగు బ్యాచ్‌లతో నాలుగువందల మందికి శిక్షణ
- పరీక్ష విధానం ద్వారా విద్యార్థుల ఎంపిక
- సకల వసతులు, మెరుగైన ఫలితాలతో సక్సెస్‌ఫుల్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణాలకు వెళ్లాల్సిన పనిలేదు, కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. కోచింగ్ ఫీజులు, పుస్తకాల కోసం జేబులు ఖాళీ చేసుకోవాల్సిన పరిస్థితి లేదు. ఉద్యోగం సాధించాలనే తపన, అందుకు తగ్గట్టుగా శ్రమ, సంకల్పం ఉంటే చాలు అభ్యర్థుల ఆశయాలకు అనుగుణంగా ఉచిత శిక్షణ అందిస్తోంది జగిత్యాల పట్టణంలోని బీట్ బజారులో గల ఎస్సీ స్టడీ సర్కిల్. సకల వసతులను ఉచితంగా కల్పిస్తూ, పోటీ ప్రపంచంలో పట్టణ, గ్రామీణ యువతను సమ ఉజ్జీలుగా నిలుపుతూ వారి ఉన్నత భవితకు బాటలు వేస్తున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో కొనసాగుతున్న కార్యక్రమాలు, విజయాలపై ప్రత్యేక కథనం...



తాత్కాలిక స్టడీ సర్కిల్ భవనం

● ఉద్యోగార్థులకు వెన్నుదన్నుగా...

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన స్టడీ సర్కిల్‌లు సత్ఫలితాలిస్తున్నాయి. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేస్తోంది. జిల్లా కేంద్రంలో 2020 జనవరిలో ఏర్పాటు చేసిన ఎస్సీ స్టడీ సర్కిల్ జిల్లాలోని నిరుద్యోగులకు వరంగా మారింది. ప్రారంభించిన నాటి నుంచి నాలుగు బ్యాచ్‌లకు శిక్షణ అందించారు. ఐదు నెలలకు ఒక బ్యాచ్ చొప్పున, వంద మందికి శిక్షణ అందించారు.

● నాలుగు బ్యాచ్‌లు, 53 కొలువులు

జిల్లా కేంద్రంలో ఉన్న ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా నాలుగు బ్యాచ్‌లకు గాను సుమారు 400మంది ఉద్యోగార్థులకు శిక్షణను అందించారు. ఇందులో 53మంది ఉద్యోగార్థులు కొలువులు సాధించారు. ఆర్ఆర్‌బీలో-01, ఎస్ఎస్‌సీ-01, పోలీసుశాఖలో-10, టీచర్ పోస్టులు-10, జూనియర్ అసిస్టెంట్-02, ఏఈ ఎలక్ట్రిసిటీ-01, జూనియర్ లెక్చరర్-02, డిగ్రీ లెక్చరర్-01, ఎల్ఐసీ డీవో-01, లైబ్రేరియన్-02, గురుకుల -03, కేజీబీవీలో-02 ఉద్యోగాలు సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు.

● ఉచితంగా మెటీరియల్ పంపిణీ

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ కోసం విద్యార్థులను పరీక్ష విధానం ద్వారా ఎంపిక చేస్తారు. ఎస్సీలకు 75శాతం, ఎస్టీలకు 10శాతం, బీసీ, మైనార్టీలకు కలిపి 15శాతం కేటాయిస్తూ, ఓరల్ రిజర్వేషన్‌లో 33శాతం మహిళలకు కేటాయిస్తూ ఈ ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ఎంపికైన విద్యార్థులకు శిక్షణతో పాటు ఉచితంగా స్టడీ మెటీరియల్ లేదా రూ.2500 మెటీరి యల్ కొనుగోలుకు అందిస్తారు.

మూడు ఉద్యోగాలు సాధించా
మంద మధుకర్, బీర్‌పూర్ మండలం తుంగూరు వాసి.

మాది బీర్‌పూర్ మండలం తుంగూరు గ్రామం. తండ్రి వ్యవసాయ కూలి, తల్లి బీడీ కార్మికురాలు. జగిత్యాల లోని బీట్‌బజార్‌లో గల స్టడీ సర్కిల్‌లో ఐదు నెలలు ఉచిత శిక్షణ పొందాను. ఈ శిక్షణ ద్వారా రైల్వే డీఎస్సీ-2024లో ఎస్జీటీ, గ్రూప్-4 లో మూడు ఉద్యోగాలు సాధించాను.



ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా
నరేష్ కుమార్, స్టడీ సర్కిల్ డైరెక్టర్, జగిత్యాల

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టడీ సర్కిల్‌ను నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. శిక్షణ ద్వారా 53 మంది కొలువులు సాధించారు.



ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి
రాజ్‌కుమార్, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి, జగిత్యాల జిల్లా

స్టడీ సర్కిల్ ద్వారా అందిస్తున్న ఉచిత శిక్షణను ఉద్యోగార్థులు సద్వినియోగం చేసుకోవాలి. అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నాం. నవంబర్‌లో నూతన బ్యాచ్ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల అవుతుంది. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని కొలువులు సాధించాలి.



పక్కా భవనం కోసం స్థల కేటాయింపు
సత్యప్రసాద్, జగిత్యాల కలెక్టర్

జగిత్యాలలో ఎస్సీ స్టడీ సర్కిల్ పక్కా భవన నిర్మాణానికి స్థలం కేటాయించాం. నిధులు కేటాయింపునకు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయిన తదుపరి భవనం నిర్మాణం చేసి, వసతులు కల్పిస్తాం. బ్యాచ్‌లు ప్రారంభం కాగానే క్రమం తప్పకుండా స్టడీ సర్కిల్‌ను సందర్శించి మౌలిక వసతులు కల్పిస్తాం.



రాజన్న క్షేత్రంలో దీపావళి వేడుకలు



అంబారీ సేవపై స్వామివారి ఉత్సవమూర్తుల ఊరేగింపు

వేములవాడ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో దీపావళి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు పూజలు చేశారు. రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులను అంబారీ సేవపై ఊరేగించారు. సూపరింటెండెంట్‌లు నర్సయ్య, నరేందర్ పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న ఎస్పీ

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని ఎస్పీ అఖిల్‌మహాజన్ దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన ఎస్పీకి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగ తం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజ అనంతరం ఆలయం అద్దాల మండ పంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ సూపరింటెండెంట్ నర్సయ్య ప్రసాదాన్ని అందజేశారు.

భక్తులు రద్దీ.. : వేములవాడ రాజ రాజేశ్వరస్వామిని గురు, శుక్రవారాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ముందు భాగంలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు.

ధర్మపురిలో దీపాలంకరణ

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆలయంలో దీపాలంకరణ

ధర్మపురి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దీపావళి పండుగ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. స్థానిక లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ దేవాలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో ధన లక్ష్మీపూజలు జరిపారు. యాగ శాల వద్ద లోక క్షేమార్థం నిత్య హవనం కార్యక్రమాలు జరిపారు. రాత్రి ప్రధాన ఆలయంలో సహస్ర దీపాలంకరణ జరిపారు. ఆలయాల్లో స్వామి వారలను అందంగా పూలతో అలంకరించారు. స్థానిక మహాలక్ష్మీ ఆలయంలో కూడ దీపాలంకరణ చేశారు. సాయంత్రం స్వామి వారల సేవలను అశ్వ వాహనంపై పురవీధుల గుండా ఊరేగించారు. అంతకు ముందు గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు అనంతరం స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



బంతిపూల తోట

బంతి సాగు.. భలే బాగు

- మూడపల్లిలో బంతిపూల సాగు చేస్తున్న యువ రైతు
- కూరగాయల స్థానంలో బంతిపూదోట

చందుర్తి నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ పంటలతోపాటు సీజనల్ పంటల సాగు చేస్తున్నాడు చందుర్తి మండలం మూడపల్లికి చెందిన యువ రైతు గోలి శ్రీనివాస్. రాజన్న సిరిసిల్ల చందుర్తి మండలం మూడపల్లికి చెందిన శ్రీనివాస్ తనకు ఉన్న 3 ఎకరాల భూమిలో రెండు ఎకరాల్లో వరి, 30 గుంటల్లో బంతి పూలతోట, 10 గుంటల్లో కూరగాయల పంటలు సాగు చేస్తున్నాడు. పంట మార్పిడిలో భాగంగా సీజనల్ పంట సాగు కింద సుమారు 30 గుంటల విస్తీర్ణంలో బంతిపూల సాగు చేపట్టారు.

ఈ ఏడాది జూలైలో కరీంనగర్‌లోని నర్సరీలో సుమారు 2500 మొక్కలు కొనుగోలు చేసి తీసుకొచ్చి నాటాడు. మొక్కలు నాటేందుకు కూలీల ఖర్చు అంతా కలిపి రూ.14,000 వేల వరకు వచ్చింది. క్రిమి సంహారక మందులకు రూ.3000 వరకు ఖర్చయ్యింది. జూలైలో నాటగా బతుకమ్మ, దసరా పండుగల నాటికి మొదటిసారి సుమారు 3 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, కిలో రూ.100 విక్రయించానని రైతు తెలిపాడు. మొదటి పర్యాయంలోనే పంట పెట్టుబడి చేతికి వచ్చిందన్నాడు. డిసెంబరు చివరనాటికి ఇలా మూడు పర్యాయాలు పూలు దిగుబడి వస్తుందని, ప్రస్తుతం రెండో సారి పూలు కోయడానికి సిద్ధంగా తెలిపాడు. హోల్‌సేల్‌గా కాకుండా రిటైల్‌గా తోట వద్ద పూలకు గిరాకీ ఉంటుందని యువరైతు పేర్కొంటున్నాడు.

మొదటి ప్రయత్నంగా బంతి సాగు
గోలి శ్రీనివాస్, యువరైతు, మూడపల్లి

బంతి పూలు సాగు చేసిన 30 గంటల భూమిలో గతంలో కూర గాయలు సాగు చేశాం. పంట మార్పిడిలో బంతి పూలు సాగు చేద్దామనే ఆలోచన వచ్చింది. ఇందు లో భాగంగా మొదటి ప్రయత్నంలో బంతి పూల సాగు చేపట్టాం. కిలో బంతిపూలను రూ.80 నుంచి రూ.100 విక్రయిస్తున్నాం. పెద్ద పరిమాణంలో తీసుకుంటే హోల్‌సేల్ ధరకు అమ్ముతున్నాం. అన్ని ఖర్చులు పోను మూడు దిగుబడులకు కలిపి రూ.50 వేల వరకు లాభం వస్తుందని ఆశిస్తున్నాం.



రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక



జిగీష

సిరిసిల్ల టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థిని కే జిగీష రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైంది. శుక్రవారం శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ పల్లె రాజురెడ్డి, రైసింగ్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ కృష్ణ జిగీషను అభినందించారు. అక్టోబరు 29న ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జిగీష రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. శనివారం నుంచి ఈ నెల 4వరకు ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు నుంచి పాల్గొననుంది. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులాలవారీగా లెక్కతేలితేనే

సమన్యాయం

- సర్వేకు సహకరించాలి
- తప్పుడు సమాచారమిస్తే కేసులు
- సమగ్ర సర్వే ఏమైందో దేవుడికే తెలియదు...
- చిత్తశుద్ధితో చేస్తున్న సర్వేతో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నా
- బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్



కమిషన్ ముందు మోకరిల్లి తన గోడును వెల్లబోసుకుంటున్న బీసీ సంఘం ప్రతినిధి కానుగంటి శ్రీనివాస్

కరీంనగర్ టౌన్/సుభాష్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా కులాలవారిగా లెక్కతేలితేనే సమన్యాయం జరుగుతుందని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల కలెక్టర్లు, అధికారుల సమక్షంలో బీసీ కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజల నుంచి అభ్యర్థనలు, సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో కులసంఘాలు, ఉప కుల సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు, వివిధ వర్గాలకు చెందిన ప్రతినిధులు బీసీ కమిషన్‌కు అభ్యర్థనలను, సూచనలను ఇచ్చి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు.

● వినతుల వెల్లువ

తాపీమేస్త్రీగా పనులు చేస్తూ సంచార జాతులుగా జీవిస్తున్న తమను బీసీ-డీ గ్రూపు నుంచి ఏ గ్రూపులో చేర్చాలని ఉప్పర సంఘం జిల్లా అధ్యక్షుడు కానుగంటి శ్రీనివాస్ కోరుతూ కమిషన్ ముందు మోకాళ్లపై కూర్చొని అభ్యర్థించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇలా మోకరిల్లడ మేమిటి ఒకింత ఆగ్రహం వ్యక్తం చేస్తూనే న్యాయం జరిగేందుకు కృషిచేస్తామని చెప్పారు.

- ➡ రెండు లక్షల జనాభా కలిగిన గాండ్లతిల సంఘం కులవృత్తి గానుగపై నూనె తయారు చేయడం పూర్తిగా కనుమరుగైందని, ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, రెడ్డిగాండ్ల కులస్థులను తమ గ్రూపు నుంచి తొలగించాలని ఆ సంఘం అధ్యక్షుడు జక్కం సంపత్ కోరారు.
- ➡ ముస్లిం రిజర్వేషన్లను 4 నుంచి 12శాతానికి పెంచాలని, ముస్లిం సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని ముఫ్తీ గయాస్ కోరారు.
- ➡ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలైన కమ్మరి, వడ్రంగి, కంచరం, శిల్పి, స్వర్ణకార వృత్తులవారిని ఆయా కులాలుగా పేర్కొంటున్నా రని, వారందరిని విశ్వ బ్రాహ్మణులు ఒకే కులంగా పరిగణించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరామోజు రవీంద్రాచారి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.
- ➡ నిర్మాణ రంగంలో పనిచేస్తూ జీవించే సగరఉప్పర కులస్తులను బీసీ-డి నుంచి 'ఏ'లోగానీ, ఎస్సీ, ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘ బాధ్యులు కోరారు.



కమిషన్ సభ్యులతో వాగ్వాదానికి దిగుతున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

- ➡ గంగపుత్రబెస్త కులాన్ని సంప్రదాయ మత్స్యకారులుగా గుర్తించాలని, ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా బీసీ నుంచి ఎస్సీల్లో చేర్చాలని ఆ సంఘం ప్రతినిధి మోసం అంజయ్య వినతిపత్రం అందించారు.
- ➡ ముస్లింలను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించాలని, నూర్‌బాషా ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసి దూదేకులకు ఆర్థికసహాయాన్ని అందించాలని దూదేకుల నూర్‌బాషా సంఘం అధ్యక్షుడు బాబుజానీ కోరారు.
- ➡ ముస్లింలలోని ఉప కులస్తుందరికీ 4శాతం రిజర్వేషన్ వర్తింపజేయాలని, ఆలయాలు, మసీదులపై దాడులు జరుగకుండా కఠినచట్టాలను అమలులోకి తేవాలని, వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సమర్థవంతంగా అమలయ్యేలా చూడాలని కాంగ్రెస్ మైనార్టీసెల్ అధ్యక్షుడు తాజొద్దీన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.
- ➡ వక్ఫ్‌బోర్డు ఆస్తులను ఆక్రమిస్తున్నారని కలెక్టర్, తహసీల్దార్ కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకునేలా చూడాలని కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు సమద్‌నవాబ్ బీసీ కమిషన్‌ను కోరారు.
- ➡ ఎంఐఎం అధ్యక్షుడు గులాంఅహ్మద్ హుస్సేన్ ముస్లింలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.
- ➡ నీరాకేఫ్‌లు ఏర్పాటు చేయాలని గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్ళపల్లి శ్రీనివాస్‌గౌడ్ కోరారు.
- ➡ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం ముదిరాజ్ దామాషా ప్రకారంగా బీసీ-డీ నుంచి బీసీ-ఏలో చేర్చాలని కోరారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చవద్దని తెలంగాణ రజక సంఘం అధ్యక్షుడు పూసాల సంపత్‌రజక, శ్రీకాంత్ కోరారు. తమకు ఆర్థిక సహాయాన్ని అందించి స్వయం ఉపాధి కల్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఫకీర్ల సంఘం అధ్యక్షుడు కోరారు.

కోర్టు ఆదేశాలను గౌరవిస్తాం

గత ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ఎందుకు చేసిందో... ఆ వివరాలు ఎక్కడ ఉన్నాయో దేవుడికే తెలుసని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ అక్టోబరు 9న స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర కుటుంబ సర్వే వివరాలను అడిగితే అధికారుల నుంచి ఎలాంటి సమాధానం లేదన్నారు. ప్రస్తుతం చేపడుతున్న కుల గణన సర్వే ఓపెన్ సీక్రెట్ అని దాన్ని బహిర్గతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల ఖరారు విషయంలో ప్రత్యేక కమిషన్‌ను 15రోజుల్లో ఏర్పాటు చేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందనే సమాచార ముందని, అయితే దీనికి సంబంధించిన తీర్పు వివరాల ఆర్డర్ కాపీ మాకు ఇంకా అందలేదని తెలిపారు. కోర్టు ఉత్తర్వులను గౌరవిస్తామన్నారు. రాష్ట్ర అడ్వకేట్ జనరల్, న్యాయనిపుణుల సలహాల మేరకు కోర్టు ఉత్తర్వులను పాటిస్తూ ముందుగా ప్రకటించిన మేరకు ఈ నెల 13 వరకు బీసీ కమిషన్ పర్యటన కొనసాగుతుందని చెప్పారు. ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేని బీసీ కమిషన్ ఎవరికీ భయపడకుండా, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చిత్త శుద్ధితో నివేదిక ఇస్తుందన్నారు. ఈ సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులు రాపోలు సత్యప్రకాశ్, రంగు బాలలక్ష్మి, తిరునగరి సురేందర్, కరీంనగర్, జగిత్యాల జిల్లాల కలెక్టర్లు పమేలా సత్పతి, సత్యప్రసాద్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



అభిప్రాయ సేకరణలో గందరగోళం

కరీంనగర్ టౌన్: బీసీ రిజర్వేషన్ల అభిప్రాయ సేకరణపై కాసేపు గందరగోళం నెలకొంది. అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, కొత్తపల్లి మున్సిపల్‌చైర్మన్ రుద్ర రాజు తదితర నాయకులతో కలిసి బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులకు వినతిపత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందన్నారు. అయితే చట్ట ప్రకారం చెల్లుబాటుకాని పద్ధతిలో కుల గణన చేస్తున్నారని, 15 రోజుల్లో ప్రత్యేక బీసీ కమిషన్ ఏర్పాటు చేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసినా ఎందుకు ఈకార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తుందంటూ మాట్లాడటంతో సమావేశంలోని బీసీ సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు రాజకీయాలు ఎందుకు మాట్లాడుతున్నారంటూ పోడియం వద్దకు వచ్చి నిరసన తెలిపారు. దీనితో కొద్దిసేపు గందరగోళం నెల కొన్నది. వెంటనే కమిషన్ చైర్మన్ నిరంజన్ జోక్యం చేసుకొని నిరసన కారులు వెళ్లి తమ సీట్లలో కూర్చోవాలని, వారి అభిప్రాయాలను చెబుతున్నారని, అడ్డుకోవద్దంటూ సర్దిచెప్పారు. అయినప్పటికీ ఎమ్మెల్యే ఎంత సేపు రాజకీయాలు మాట్లాడతారంటూ ఆందోళన చేయగా పోలీసులు వారిని వెళ్ళగొట్టేందుకు ప్రయత్నించగా చైర్మన్ నిరంజన్ పోలీసులు అక్కడి నుంచి వెళ్లి పోవాలని, మీ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఆ తర్వాత జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కూడా మాట్లాడేందుకు ప్రయత్నించగా అనుమతించలేదు. ఈ సందర్భంగా సంజయ్, కౌశిక్ కొంత అసహనం వ్యక్తం చేసినప్పటికీ వారికి అనుమ తించక పోవడంతో వారు వేదిక నుంచి దిగి వెళ్లిపోయారు.

న్యూస్ బాక్స్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వేములవాడ రూరల్ నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : లింగంపల్లి, హన్మాజీపేట, బొల్లారం గ్రామాలలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను చైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలు రైతులకు ఎలప్పుడు అండగా ఉంటాయన్నారు. వైస్ చైర్మన్ లక్ష్మీకాంతరావు, డైరెక్టర్లు సురేందర్, సంజీవ్ రెడ్డి, ప్యాక్స్ సెక్రెటరీ లక్ష్మణ్, మాజీ సర్పంచులు సామ కవిత తిరుపతిరెడ్డి, విజయ శ్రీనివాస్‌రెడ్డి, లచ్చయ్య పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని సింగిల్ విండ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చివరి గింజ వరకు కొను గోలు చేయనున్నట్లు చెప్పారు. సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, సింగిల్ విండ్ చైర్మన్ కిషన్‌రావు, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్ పర్సన్‌కు సన్మానం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం-గౌస్ దంపతులను స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. దోబీ ఘాట్ ప్రహరీ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. సంఘం సభ్యులు భూపతి, నర్సయ్య, రాజయ్య పాల్గొన్నారు.

అప్పుల బాధతో గల్ఫ్‌కార్మికుడి ఆత్మహత్య

గంభీరావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో గల్ఫ్‌కార్మికుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన ఆవునూరి భాస్కర్ (28) అనే యువకుడు బతుకుదెరువు కోసం అప్పులు చేసి మూడు సార్లు గల్ఫ్‌కు వెళ్లాడు. వెళ్లిన ప్రతీసారి సరైన పనిలేక అవస్థలు పడ్డాడు. పస్తులు ఉండే పరిస్థితి రావడంతో స్వదేశానికి తిరిగి వచ్చాడు. అప్పులు సుమారు రూ.5 లక్షల వరకు పేరుకుపోయాయి. దీంతో ఎలా తీర్చాలని నిత్యం కుటుంబ సభ్యులకు చెప్పుకుంటూ బాధ పడేవాడు. అప్పులు తీర్చే మార్గం లేక మానసికంగా కుంగిపోయాడు. గురువారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లిన భాస్కర్ ఊరు బయట పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకుమార్ తెలిపారు.

అన్నదాతకు అల్పపీడన భయం

- కురిసిన వర్షం - తడిసిన ధాన్యం
- కొన్ని చోట్ల ప్రారంభం కాని కొనుగోళ్లు



రంగంపేటలో వర్షానికి కొట్టుకుపోతున్న ధాన్యం

సిరిసిల్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంట చేతికి వస్తున్న దశలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియక ఆరబోసిన ధాన్యం వద్ద ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోళ్లు చేపట్టకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో కొనుగోలు కేంద్రాలు, పొలాల వద్ద రోడ్లపై ఆరబోసుకున్న ధాన్యం తడిసిపోయింది. వీర్నపల్లి, సిరిసిల్ల, రుద్రంగి, తంగళ్లపల్లి, మండలాల్లోని కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసింది. వర్షాలు, తుపాను ప్రభావం ఉంటుందనే సమాచారం మేరకు రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

శరవేగంగా ప్రాజెక్టు పూర్తి చేయాలి



సూరమ్మ ప్రాజెక్టుపై చర్చిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అధికారులు



మర్రిపల్లి రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్, అధికారులు

రుద్రంగి, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు శరవేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. రుద్రంగి మండల కేంద్రం శివారులోని కలికోట సూరమ్మ ప్రాజెక్టును శుక్రవారం ఈఎన్‌సీ అనిల్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సూరమ్మ ప్రాజెక్టు పనులపైన అధికారులు, రైతులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలికోట సూరమ్మ చెరువులో నష్టపోయి డబ్బులు రాని రైతులకు పరిహారం డబ్బులు రూ.5 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే అందజేస్తామని తెలిపారు. కుడి ఎడమ కాలువ నిర్మాణానికి భూసేకరణ కోసం నోటిఫికేషన్ విడుదల చేయబోతున్నామన్నారు. గతంలో పీసీసీ హోదాలో రేవంత్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ప్రాజెక్టును సందర్శించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో రాష్ట్రంలో 9 ప్రాజెక్టుల్లో కలికోట సూరమ్మ ప్రాజెక్టును చేర్చినట్లు చెప్పారు. ఇటీవల బడ్జెట్ సమావేశాల్లో రూ.325 కోట్లు కేటాయించారన్నారు. ఈసీ సుధాకార్, ఈఈ అమరేందర్, సంతుప్రకాష్, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తూం జలపతి, గండి నారాయణ, చెలుకల తిరుపతి, పల్లి గంగాధర్, సనుగుల గంగాధర్, తర్రె లింగం, గుగ్గిళ్ల వేంకటేశం, పిడుగు లచ్చిరెడ్డి, దయ్యాల శ్రీనివాస్, దసారి గంగారాజం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కాళేశ్వరం 9వ ప్యాకేజీలో భాగంగా చేపట్టిన మల్కపేట రిజర్వాయర్ మిగిలిన పూర్తిచేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు తప్ప గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ పంప్ హౌస్, కంట్రోల్ రూంను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగిలిపోయిన ప్రాజెక్టు పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వేములవాడ నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. 90 శాతం పూర్తయి 10 శాతం అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారని అన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 1737 కోట్లను కేటాయించి ప్రారంభించారన్నారు. 2009లో ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులే తప్ప గత ప్రభుత్వం కొత్తగా ఏమీ చేయలేదన్నారు. మలకపేట రిజర్వాయర్ నిర్మాణం 90 శాతం పూర్తయ్యిందని, మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయడానికి రూ.20 కోట్లు వెచ్చించి రైతులకు 30 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని అన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేట మండలం నర్మాలోని ఎగువ మానేరు నింపేందుకు సింగసముద్రం వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేసి గ్రావిటీ ద్వారా మలకపేట రిజర్వాయర్ నుంచి నీటిని తరలిస్తామన్నారు. కలికోట సూరమ్మ చెరువు ద్వారా 43 వేల ఎకరాలకు నీరందించేందుకు పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్నారు. కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా అధికారులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు సాగు నీరందించడమే తమ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మర్రిపల్లి రిజర్వాయర్ పనులను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. మర్రిపల్లి రిజర్వాయర్ పనులు త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అనీల్‌కుమార్, సీఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ సంతు ప్రకాశ్ పలువురు నాయకులు ఉన్నారు.

కార్తీకం.. ఆధ్యాత్మికం

5వ పేజీ తరువాయి..

ద్విముఖ వత్తితో కుటుంబంలో సఖ్యత కలుగుతుంది. త్రిముఖ వత్తితో సంతాన భాగ్యం, ఉత్తమ సంతానం, చతుర్ముఖ వత్తితో ధన సంపత్తు, ఐశ్వర్యం, పంచముఖ వత్తులతో సంపద, లాభాలు కలుగుతాయని భావిస్తారు.

తులసీ పూజ

క్షీరాబ్ది ద్వాదశి రోజున మహిళలు సూర్యాస్తమయం అనంతరం తులసీవనం వద్ద లక్ష్మీనారాయణన్ని పూజిస్తారు. అనేక ఆకారాల్లో దీపాలు వెలిగిస్తారు.

బొమ్మల కొలువులు

కార్తీక శుక్ల పక్షం మొదటి రోజున మహిళలు బొమ్మల కొలువుతోపాటు గోవర్ధన పూజ నిర్వహిస్తారు. శ్రీకృష్ణ భగవానుడిని బొమ్మగా తయారు చేసి నీరు, పూలు, పెరుగు, కుంకుమ, బియ్యం, మిఠాయిలో నైవేద్యం సమర్పిస్తారు. స్వామి ఆరాధన శ్లోకాలతో భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు.

కార్తీక మాసం ప్రత్యేక పూజలు

కార్తీక మాసంలో నోములు, వ్రతాలతోపాటు కొన్ని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కార్తీక శుక్లపక్షం మొదటి రోజున గోవర్ధన పూజ నిర్వహిస్తారు. కార్తీక శుక్ల పక్షం రెండో రోజున భగిని హస్తభోజనం అనే పండుగ నిర్వహిస్తారు. కార్తీక మాసంలో శుద్ధ చవితి రోజు నాగుల చవితి పండుగను నిర్వహించి నైవేద్యం సమర్పిస్తారు. దీంతోపాటు దేవోత్థాని ఏకాదశి పండుగ, వన భోజనాలు, కార్తీక పూర్ణిమ రోజున తులసి పూజలు నిర్వహిస్తారు.

ఉసిరి చెట్టుకు పూజలు

కార్తీక మాసంలో ఉసిరి చెట్టు వద్ద విష్ణు పూజలు చేస్తారు. దివ్య క్షేత్రాల్లో విష్ణువుకు పూజ చేసినంత ఫలితం లభిస్తుందని భావిస్తారు.

వన భోజనాలు

కార్తీక మాసంలో వన భోజనాలకు ప్రత్యేకత ఉంది. రావి, ఉసిరి, మామిడి, మారేడు వంటి చెట్ల కింద సామూహిక వన భోజనాలు చేస్తారు. ఆధునిక కాలంలో కూడా ప్రకృతితో ఉన్న అనుబంధం వన భోజనాలతో కనిపిస్తోంది. కుటుంబమంతా ప్రశాంత వాతావరణంలో ఆత్మీయ బంధాలను పంచుకుంటూ గడపడం ఆనందాన్నిస్తుంది.

దళితులను మోసం చేసిన బీఆర్ఎస్

ఇల్లంతకుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దళితులను మోసం చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు మచ్చ రాజేశం అన్నారు. మండలకేంద్రంలోని వైశ్యభవనంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు ఇష్టానుసారంగా మాట్లాడం మానకోవాలన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటిపై మరోసారి విమర్శలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో దళితులకు కనీసం డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కూడా ఇవ్వలేదన్నారు. మండలంలోని దళితులను రెండువర్గాలుగా విడగొట్టింది మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కాదా? అని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు బడుగు లింగం, చంద్రమౌళి, మామిడి నరేష్, కాసుపాక శంకర్, దాసు, గొల్కొండ శంకర్, రమేష్ తిరుపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

తంగళ్లపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రం ప్రారంభించి ఇప్పటి వరకు ధాన్యం కోనుగోలు చేయడం లేదని తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట కేంద్రం వద్ద రైతులు, ప్యాక్స్ డైరెక్టర్ బండి దేవేందర్ యాదవ్ గురువారం నిరసన వ్యక్తం చేశారు. మండలంలో గండిలచ్చపేట, ఓబులాపూర్ తదితర గ్రామాల్లో ధాన్యం కోనుగోలు కేంద్రాలు ప్రారంభించి వదిలేశరన్నారు. వెంటనే తూకం వేయాలని డిమాండ్ చేశారు.

చందుర్తి : కేంద్రాలలో ధాన్యం పోసి నెల రోజులు గడుస్తున్నా ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పంట కోసి నెల రోజులు అవుతున్నా కల్లాలల్లో మాత్రం ధాన్యం తూకం ప్రారంభించడం లేదన్నారు. తద్వారా రైతులు అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడుతాం

సిరిసిల్ల టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాడుతాం అని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు అన్నారు. ఏఐటీయూసీ ఆవిర్భవదినోత్సవంలో భాగంగా ఆదివారం సిరిసిల్ల పట్టణం ఏఐటీయూసీ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడారు. 1920 అక్టోబరు 31న ఏఐటీయూసీ ఆవిర్భవించిందన్నారు. నాటి నుంచి నేటి వరకు దేశంలోని అన్ని రకాల కార్మికుల హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటాలలో ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల పోశెట్టి, నాయకులు పోచమల్లు, రాజన్న, రామస్వామి, రమేష్, మల్లేశం, సివిల్ సప్లయ్ హమాలి సంఘం జిల్లా అధ్యక్షుడు పుప్పాల రాజేష్, నాయకులు శివలింగం, వెంకటేష్, గ్రామ పంచాయితీ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ దుంద్రపెల్లి రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్, మంత్రి దృష్టికి రైతుల ఇబ్బందులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల్లోని ధాన్యం కొనుగోలులో జరుగుతున్న జాప్యంతో రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య తెలిపారు. గురువారం వేములవాడ, కరీంనగర్ పట్టణాల్లో ప్రభుత్వ విప్, మంత్రిని మార్యదపూర్వకంగా కలిశామని పేర్కొన్నారు. శుక్రవారం నుంచి కొనుగోలు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారని చెప్పారు. మిల్లర్లు ధాన్యం సేకరించకపోతే ప్రభుత్వమే కొనుగోలు చేసి గోదాంలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసిందని వెల్లడించినట్లు పేర్కొన్నారు. అన్నదాతలు ఆందోళన చెందవద్దని కోరారు. నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, మల్లారెడ్డి, రాంరెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, చిన్నలక్ష్మీ, బుచ్చాగౌడ్, బాబు, గంగయ్య, నాగరాజు, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఊరూరా దీపావళి వేడుకలు



దుకాణాల ఎదుట టపాసులు కాలుస్తున్న వ్యాపారులు

ఇల్లంతకుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో భక్తిప్రపత్తుల మధ్య గురువారం దీపావళి వేడుకలు నిర్వహించారు. వ్యాపార సంస్థల్లో ధన లక్ష్మిపూజలు చేశారు. కేదారేశ్వరి వ్రతాలు శుక్రవారం కొనసాగాయి.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్, నారాయణపూర్, బండలింగంపల్లి, అల్మాస్‌పూర్, తిమ్మాపూర్, గుండారం, వెంకటాపూర్ తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపాలను వెలగించి లక్ష్మీ పూజలు చేశారు. చిన్నారులు, పెద్దలు టపాసులు కాల్చారు. తహసీల్దార్ రామచంద్రం, ఎంపీడీవో సత్తయ్య, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య శుభాకాంక్షలు తెలిపారు.

గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంలోని మా అనాధ వృద్ధుల ఆశ్రమంలో గురువారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుడు మల్లుగారి నర్సయ్య గౌడ్ బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశాడు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో గురువారం వెలుగుల పండుగ దీపావళి ఘనంగా నిర్వహించారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో దీపావళి వేడుకలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. దీపావళి సందర్భంగా ఉదయం నుంచి ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని దుకాణాలలో లక్ష్మి పూజలు నిర్వహించారు. పలు దుకాణాల లక్ష్మి పూజలకు నాయకులు హాజరయ్యారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు ఉపాధి కరువు

వేములవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రైవేటీకరణ కారణంగా కార్మికులకు ఉపాధి కరువవుతున్నదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు అన్నారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం వేములవాడ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అమరవీరుల స్తూపం వద్ద కడారి రాములు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం నేటికీ ఉద్యమాలు చేస్తున్నామన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల పోశెట్టి, కార్యదర్శి శ్రీరాములు, నర్సయ్య, పండుగ పోషమల్లు, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మరాఠీ రాజయ్య, ఉపాధ్యక్షులు గాజుల వజ్రవ్వ, కార్యదర్శి పందుల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి



నివాళి అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉప ప్రధాని, మాజీ కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతిని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా యువజన అండ్ స్పోర్ట్స్ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా జ్యోతి ప్రజ్వలన చేశారు అనంతరం వల్లబాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ వల్లబాయ్ పటేల్ స్వాతంత్ర్య పోరాటం, దేశ నిర్మాణంలో అందించిన సేవలను కొనియాడారు. జిల్లా యువజన అండ్ స్పోర్ట్స్ శాఖ అధికారి రాందాస్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంత్‌రావు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో గురువారం మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి నిర్వహించారు. బెటాలియన్‌లో సర్దార్ వల్లబాయ్ పటేల్ చిత్రపటానికి బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో సాంబశివరావు మాట్లాడుతూ స్వాతంత్రసమరయోదుడుగా భారత తొలి ఉపప్రధానిగా, హోం మంత్రిగా దేశానికి విశిష్ట సేవలు అందించారని, దేశ ఐక్యతకు పాటుపడిన మహనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరిసిల్లలో బీజేపీ ఆధ్వర్యంలో

సిరిసిల్ల పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాతబస్టాండ్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. బీజేపీ కరీంనగర్‌పార్లమెంటరీ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు అంకారపు రాజు తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్ల సర్దాపూర్ పోలీస్ బెటాలియన్‌లో..

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం



వేములవాడలో నివాళులర్పిస్తున్న విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్/ వేములవాడ:, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా పేద ప్రజల అభ్యున్నతి సంక్షేమం కోసం నాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ చేసిన సేవలు అమూల్యమైనవని వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని గురువారం వేములవాడ పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ పేద ప్రజల సంక్షేమం కోసం, దేశ అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు నివాళులర్పించారు. దేశం కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలను, త్యాగాలను కొనియాడారు. గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెల్మల స్వరూపతిరుపతిరెడ్డి, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వెంగల అశోక్, ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అకునూరి బాలరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, చేనేత సెల్ పట్టణ అధ్యక్షుడు బాలరాజు, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వెంకటేశం, రాజు, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్ల లక్ష్మినారాయణ, వెంగళ లక్ష్మినర్సయ్య, అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నీలి రవీందర్, మాజీ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య పాల్గొన్నారు

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలోని రాజీవ్ కూడలిలో పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జిల్లా నాయకులు కొండం రాజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ తలారిరాణి నర్సయ్య, బీసీ సంఘం మండల అధ్యక్షుడు శీల ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : ఇందిరమ్మ ఆశయాలను కొనసాగించాలని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి గురువారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. నాయకులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, గౌస్, గిరిధర్‌రెడ్డి, మల్లారెడ్డి, రవియాదవ్, రాజునాయక్, బాబు తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాచౌక్ చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహనికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేశారు. పార్టీ మండల అధ్యక్షులు తూం జలపతి, గట్ల మీనయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, చెలుకల తిరుపతి, కోమిరె శంకర్, తర్రె లింగం, మాడిశెట్టి అబిలాష్, గండి నారాయణ పాల్గొన్నారు.

చందుర్తి : చందుర్తిలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు మల్లేశం, ఎన్గంటి శంకర్, ఇందూరి మధు, బాణాల రవిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బోయినపల్లి : బోయినపల్లి మండల కేంద్రంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మిపతి గౌడ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న నాయకులు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

సిరిసిల్ల టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారు. శుక్రవారం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సిరిసిల్ల పట్టణం సిద్దార్థ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థినులు కే స్నేహ, బీశ్రీనిధిని పాఠశాల కరస్పాండెంట్ నాగుల సంతోష్ అభినందించారు. అక్టోబరు 27న ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ - 17 బాలికల విభాగంలో స్నేహ, శ్రీనిధిలు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 3 నుంచి 5 వరకు మహబూబ్‌నగర్ జిల్లా రాచాలలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొననున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్స్ బిజ్జు, మార్టిన్, వ్యాయామ ఉపాధ్యాయుడు మదన్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో షుగర్ టెస్టులు

గంభీరావుపేట, నవంబరు 1, (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ టెస్టులు నిర్వహించారు. మండలంలోని గాంధీ వద్ద, పాల కేంద్రం దగ్గర ప్రజలకు పెద్ద మొత్తంలో టెస్టులో చేయించుకున్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చెందిన కమలాకర్ రెడ్డి, సంతోష్ రెడ్డి,నరసింహరాజు, నాగరాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.